తేదీ 17.10.2003, సాయికుల్వంత్ సభామండపం

# అందరిపట్ల సోదర భావాన్ని పెంచుకోండి!

**గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి**
**సావిత్రి భారత సతియె కాదె**
**తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె**
**చంద్రమతి పవిత్ర పడతి కాదె**
**కులసతీత్వమునకై గుండాన దూకిన**
**సీత భారత ధరాజాత గాదె**
**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**
**దమయంతి భారత రమణి గాదె**
**సత్యసాగర పరివేష్టితోర్వితలము**
**భరతజాతి పాతివ్రత్య ప్రవిమలంబు**
**భావసంపద కిది మహా పంటభూమి**
**అఖిల దేశాల కిది ఉపాధ్యాయి కాదె**

*ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! విద్యార్థినులారా!*

మానవత్వమునందు మహత్తరమైన శక్తులు అనంతమైనటువంటివిగా ఉన్నాయి. కాని, మానవుడు ఏమీ తెలియని అజ్ఞానివలె జీవిస్తున్నాడు. కొంతమందియందు ఉన్నటువంటి మహత్తరమైన శక్తులు బహిర్ముఖమౌతుంటాయి. కాని, కొందరి యందు అవి అంతర్ముఖంగానే నిలిచి ఉంటాయి.మానవత్వములో ఉన్నదివ్యత్వమును గుర్తించుకోవడానికి ప్రతి వ్యక్తీ ప్రయత్నించాలి. మానవత్వము ఒక పవిత్రమైన ఆదర్శమును అందించే నిమిత్తం ఏర్పడింది. తనయందు మహత్తరమైన శక్తులు ఉన్నప్పటికీ మానవుడు ఏమీ తెలియనివానివలె గోచరిస్తూ ఉంటాడు. అట్టి దివ్యశక్తులలో ఒక శక్తి జానకిరామయ్య. ఈ

sri sathyasai vachanamrutam

దేహముకంటే తాను రెండున్నర సంవత్సరములు చిన్నవాడు. వయస్సులో చిన్నవాడైనప్పటికీ రాజకీయరంగములో మహా ఆరితేరినవాడు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పే స్వభావము అతనిది. "రామయ్యా! అట్లా దుడుకుతనంగా మాట్లాడకూడదు. ఎవరియందు ఏవిధమైన శక్తి ఉన్నదో నీకు తెలియదు. కనుక, నీవు నాలుకను అదుపులో ఉంచుకో," అని నేను మధ్యమధ్య చెబుతూ ఉండేవాడిని. మాటలు కఠినంగా చెప్పేవాడేగాని, అతని హృదయము మాత్రం చాలా చల్లనైనది.

లక్ష్మణుడు యుద్ధములో మూర్ఛిల్లినప్పుడు రాముడు, "సుగ్రీవా! లోకములో వెతికితే నాకు సీతవంటి భార్యయైనా దొరకవచ్చు; కౌసల్యవంటి మాతృదేవత కూడా లభించవచ్చు; కాని, ఎంత వెతికినా లక్ష్మణునివంటి సోదరుడు లభించడు," అని చెప్పాడు. ఈరీతిగా, రాముడు తన సోదరుని ప్రేమతత్త్వాన్ని ఎంతో వర్ణిస్తూ వచ్చాడు. ఇటువంటి అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, తల్లిదండ్రులు అనేక కుటుంబాలలో ఉత్తమమైన ఆదర్శాలను నిరూపిస్తూ వచ్చారు. ఇట్టి ఆదర్శవంతులైన సోదరులు ఈనాడు లోకంలో ఉన్నారా, అని మీరు సందేహించ నక్కర్లేదు. ఎందరోఉన్నారు. తాత్కాలికంగా అభిప్రాయ భేదములు ఏర్పడినప్పటికీ ఒకరినొకరు నిరంతరం ప్రేమిస్తూనే ఉంటారు.

**ఆదర్శ సోదరప్రేమ**

ఒకనాడు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు నల్గురూ కలసి బంతి ఆట ఆడుకుంటున్న సమయంలో భరతుడు పరుగెత్తుకుంటూ వచ్చి కౌసల్య ఒడిలో కూర్చున్నాడు. అతడు చాలా విచారంగా ఉండడం చూసి, "భరతా! ఎందుకింత విచారంగా ఉన్నావు?" అని ప్రశ్నించగా, "అమ్మా! ఆటలో నన్ను గెలిపించే నిమిత్తం రాముడు ఉద్దేశపూర్వకంగా ఓడిపోయాడు," అని చెప్పాడు. ఆ అన్నదమ్ములు నల్గురూ అట్టి అన్యోన్యతను, ఆప్యాయతను, ఆనందమును అనుభవిస్తూ వచ్చారు. "అమ్మా! రాముడు మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా చూసుకుంటున్నాడు. రామునివంటి అన్న మాకు ఎక్కడా లభించదు," అని లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు తమ తల్లులతో చెప్తూ ఉండేవారు. నిరంతరం రామునికి సన్నిహితంగా ఉండి, రాముని ఆప్యాయతను, ఆనందమును అందుకొని అతనికి సేవలు చేయాలని ఆశించేవారు. అటువంటి ఆదర్శప్రాయులైన సోదరులు ఈనాటికీ ఉన్నారు. కాని, ఈనాడు లోకము వారికి

sri sathyasai vahini

తగిన ఉత్సాహ ప్రోత్సాహములనందించడం లేదు. మన సంస్థలు సోదరత్వాన్ని పెంపొందించాలి. 'సోదరులు' అనే మాట కేవలం నోటికి పరిమితం కాకూడదు; ప్రవర్తనలో నిరూపించబడాలి. ఆదర్శ సోదరప్రేమను ప్రపంచమునకు వ్యాప్తిగావించినవాడు రాముడు. అరణ్యవాసము చేస్తున్న సమయంలో లక్ష్మణుడు ఒక్క క్షణమైనా కనిపించకపోతే రాముడు ఎంతో ఆందోళన చెందేవాడు. సోదరులనగా ఎవరు? దేహములు వేరైనా ప్రాణము ఒకటిగా ఉండాలి. ఇటువంటి సోదరులు భారత దేశంలో ఆనాడే కాదు, ఈనాడు కూడా ఉన్నారు. కాని, వారు ఇతరులకు తమ ఉత్తమ భావాలను అందించలేకపోతున్నారు. ఒకరికొకరు ప్రేమను పంచుకున్నప్పుడే మానవత్వములోని దివ్యత్వము చక్కగా అర్థమౌతుంది. ఈనాడు ముఖ్యంగా మానవుడు చేయవలసింది ఏమిటి? సర్వమానవులయందున్న ఆత్మతత్త్వాన్ని చక్కగా చవిచూడాలి. ఆత్మయొక్క మాధుర్యం మరియెందునూ కానరాదు. ఆత్మతత్త్వము ఆకారము లేనటువంటిది. అయితే, ఆ నిరాకార తత్త్వమునందే నిండుప్రేమ మిళితమై ఉంటుంది. అట్టి ఆత్మతత్త్వాన్ని ప్రతి మానవుడూ గుర్తించవలసిన అవసరమున్నది. మానవత్వములో ఉన్న దివ్యత్వాన్ని గుర్తించినటువంటివాడే నిజమైన మానవుడు. వ్యక్తిగతమైన తత్త్వమును నిరూపించడానికి వీలౌతుందిగాని, ఆత్మతత్త్వాన్ని ఎవ్వరూ నిరూపించలేరు.

**మానవత్వమనగా త్రికరణశుద్ధి**

ఈనాటి విద్యార్థులు కేవలం ఉన్నతమైన పదవులను అందుకునే నిమిత్తమై చదువులు చదువుతున్నారేగాని, ఉన్నతమైన ఆదర్శమును, ప్రేమను అందించుటకు ఎవ్వరూ ముందంజ వేయుటలేదు. విద్యార్థులలో ముఖ్యంగా ఉండవలసిన లక్షణమేమిటి? "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం." మనసు, మాట, క్రియలు ఒక్కటిగా ఉండాలి. మాటలు తీయగా ఉండి మనసు చేదుగా ఉంటే ప్రయోజనం లేదు. మనసు, మాట, క్రియలు అన్నీ మాధుర్యంతో నిండి ఉండాలి. ఇదే మానవత్వానికి నిజమైన చిహ్నం. The proper study of mankind is man. కాని, అట్టి mankind ఈనాడు కనిపించడం లేదు. మానవుడు సాటిమానవుని గౌరవిస్తున్నాడేమోగాని, ప్రేమతత్త్వాన్ని, ఆనందాన్ని పరస్పరం పంచుకోవడం లేదు. మానవతావిలువలు ఎక్కడా కనిపించడం

sri sathyasai vachanamrutam

లేదు. మాది Mankind (మానవజాతి) అని చెప్పుకుంటారేగాని, లోపలున్నది వట్టి Monkey mind (కోతిబుద్ధి). ఇలాంటి మానవునిలో మానవత్వము ఏరీతిగా వికసిస్తుంది? అందరూ మన సోదరీసోదరులేనని భావించినప్పుడే మనం నిజంగా మానవులమని చెప్పుకోవచ్చు.

ఏకత్వము ఏనాడు లోపిస్తుందో ఆనాడే శత్రుత్వము ఏర్పడుతుంది. ద్వేషము కూడా ఆవిర్భవిస్తుంది. ప్రేమతత్త్వము నశించిపోతుంది. కనుక, మొట్టమొదట ఏకత్వమును పోషించుకోవాలి. మానవుడు తనయందున్న ప్రేమను ప్రతి వ్యక్తికీ పంచడానికి ప్రయత్నించాలి. అప్పుడే మానవత్వంలోని సోదరత్వమును తాను అనుభవించినవాడౌతాడు. Brotherhood of man, Fatherhood of God (మానవత్వములోని సోదరత్వము, దైవత్వములోని పితృత్వము)ను మనం గుర్తించి వర్తించిననాడే భారతదేశము గొప్ప ఆదర్శవంతమైన దేశముగా రూపొందుతుంది. కేవలం సోదరులలోనే కాదు, సతీపతులయందుకూడా అన్యోన్యత ఆవిర్భవించాలి. ఈనాడు చూడండి, డా॥ పిళ్ళై తన భార్యపైనున్న ప్రేమచేత ఆమె జ్ఞాపకార్థం ఇక్కడొక నర్సింగ్ క్యాంపస్‌ను ప్రారంభించాలని ఆశిస్తున్నాడు. ఈయన నిన్నో, నేడో వచ్చినటువంటివాడు కాదు. గత ముప్పై సంవత్సరాలనుండి తాను స్వామిసన్నిధికి వస్తూ ఉన్నాడు. ఆయన భార్య చాలా ఉత్తమురాలు. చిరునవ్వులు చిందిస్తూ అందరితో మృదుమధురంగా సంభాషించేది. అటువంటి ఆదర్శప్రాయులైన స్త్రీలు భారతదేశములో ఈనాడు ఎందరో ఉన్నారు. వారివలననే దేశం నిత్యకళ్యాణం పచ్చతోరణంగా కళకళలాడుతూ ఉన్నది.

**భారతదేశంలో లేనిది ఏ దేశంలోనూ లేదు**

ఈనాటి విద్యావంతులు విదేశాలలో గొప్ప ఆనందము దొరుకుతుందని భావించి పవిత్రమైన భారతదేశాన్ని వదలిపెట్టి విదేశాలకు పోతున్నారు. భారత దేశంలో లభించని ఆనందము మరి యే దేశంలోనూ మనకు లభించదు. "ఎన్న భారతే తన్న భారత." భారతదేశంలో లేనటువంటిది మరి యే దేశంలోనూ కానరాదు. కనుకనే, ఇన్ని వేల సంవత్సరాలనుండి భారతదేశము అన్ని దేశాలతోనూ కలసిమెలసి కలతలు లేకుండా చెలిమితో జీవిస్తూ ఉన్నది. భారతీయులు పరదేశస్థులకుకూడా తమ ప్రేమను పంచుతూ

srisathyasaivachanamrutam

వచ్చారు. అందరినీ సోదర సోదరీమణులుగా భావించి ప్రేమతో చూసుకుంటూ వచ్చారు. మానవత్వములోని సోదరత్వమును, దైవత్వములోని పితృత్వమును గుర్తించి వర్తించినటువంటివారు భారతీయులు మాత్రమే. కనుకనే, ఇతర దేశస్థులు భారతదేశంపై ఎన్నిసార్లు దండెత్తినప్పటికీ భారతీయుల ప్రేమ ఏమాత్రం చెక్కుచెదరలేదు, కట్టుకదలలేదు. మానవత్వమునకు ప్రేమయే ప్రధాన చిహ్నము. ప్రేమవల్లనే మానవత్వమునకు ఇంత విలువ ఏర్పడింది. ప్రేమ తత్త్వమును చాటే నిమిత్తమై పరమాత్ముడుకూడా ఈ జగత్తులో అవతరిస్తున్నాడు. మీ హృదయంలో ప్రేమ నింపుకున్నారంటే ప్రపంచమే మీ హస్తగతమైపోతుంది. మీలో ప్రేమ ఉన్నది. కాని, దానిని ప్రకటించవలసిన విధానం తెలియక మీరు పొరపాటుపడుతున్నారు.

**ప్రేమయే మీ ప్రాణంగా విశ్వసించండి**

విద్యార్థులారా! మీరెన్నో గ్రంథాలు చదువుతున్నారు. ఎన్నో చరిత్రలు పఠిస్తున్నారు. కాని, రామచరిత్రను ఏమాత్రం అర్థం చేసుకున్నారు? రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల ఆదర్శ సోదరప్రేమను మీరు ఏమైనా గుర్తించారా? మొట్టమొదట మీరు అందరిపట్ల సోదరభావాన్ని పెంచుకోండి. మిమ్మల్ని ద్వేషించే వ్యక్తిని సహితం ప్రేమించండి. అతడు కనిపించినప్పుడు, 'సోదరా, ఎలా ఉన్నావు?' అని ప్రేమతో పలుకరించండి. 'సోదరా' అన్న పిలుపు వానిలోని ద్వేషాన్ని కరిగిస్తుంది. ప్రేమతో సాధించలేనిది ఈ జగత్తులో ఏదీ లేదు. ప్రేమను అనుభవించడానికి చేతకాక మీరు దానిని మానవత్వానికి విరుద్ధమైన మార్గంలో ప్రవేశపెట్టి నిరర్థకం గావిస్తున్నారు. ప్రేమయే ప్రధానమైన శక్తి. ప్రేమయే ప్రధానమైన మానవతావిలువ. ప్రేమను హృదయంలో నింపుకున్నప్పుడు ప్రపంచంలో అందరూ మీకు సోదరీసోదరులుగా కనిపిస్తారు. మీకు విరుద్ధమైన వ్యక్తులే కానరారు. కనుకనే, గోపికలు కృష్ణుని ఈరీతిగా ప్రార్థించారు:

**"ప్రేమరహిత మరుభూములలో**
**ప్రేమాంకురములు పెంపొంద.... ప్రేమావేశముతో**
**ప్రేమసుధావర్షము వర్షింపగ .... ప్రేమనదులు ప్రవహింపగ**
**మురళీగానము సేయగదె! ..... కృష్ణా! గానము సేయగదె!"**



srisathyasaivachanamrutam

ప్రేమస్వరూపులారా! మీరందరూ ప్రేమమయులే! మీ ప్రేమను ప్రవహింప జేయండి. ప్రేమయే మీ ప్రాణంగా విశ్వసించండి. ఇదియే మీ ప్రధాన కర్తవ్యము. మీరు ఇంతమంది వ్యక్తులు ఇక్కడ ఏవిధంగా చేరినారు? నా ప్రేమయే మీ అందరినీ ఆకర్షించినది. అదే దివ్యమైన అయస్కాంత శక్తి. ఈ 'మ్యాగ్నెటు'తో చేరినప్పుడు మీరు కూడా ప్రేమమయులుగా మారిపోతారు. రామాయణము నందుగాని, మహాభారతమునందుగాని, భగవద్గీతయందుగాని, ఖురానుయందు గాని ఎందుచూసినా ప్రేమతత్త్వమే ప్రధానముగా కనిపిస్తుంది. ప్రేమకన్న వేరే సంపాదించవలసిన ఆస్తి లేదు. ప్రేమస్వరూపుడైన భగవంతుణ్ణి ప్రేమతోనే వశం చేసుకోవడానికి వీలౌతుంది.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! ఈనాటి Education (విద్య) కేవలం Agitation (ఆందోళన)కు దారితీస్తున్నది. మీలో చదువుకన్న ముఖ్యంగా ప్రేమ ఉండాలి. Love is life. ఇంతేకాదు. Love is light కూడా. ప్రేమ జ్యోతియే మీకు దారిచూపుతుంది. అంధకార బంధురమైన ఈ జీవితారణ్యములో ప్రేమజ్యోతిని హస్తములో ఉంచుకొని ప్రయాణము చేయండి. ఎంత దూరము ప్రయాణము చేసినప్పటికీ చీకటి మీ చెంతకు రాదు. Love is God. Live in love. ప్రేమయే పరమాత్మ అని మీరంటున్నారు. కాని, ప్రేమలో జీవించడం లేదు.

ఈరోజు సి. శ్రీనివాస్, ప్రస్తుత వైస్ ఛాన్సలర్, మాజీ వైస్ ఛాన్సలర్... వీరందరూ హృదయంలో ప్రేమను నింపుకొని మాట్లాడినారు. వీరు మీ హృదయంలోకూడా ప్రేమగంటలను మ్రోగిస్తున్నారు. కాని, ఆ దివ్యనాదమును మీరు ఏమాత్రం ఆలకించడం లేదు. ప్రేమనాదమును విన్నంతనే మీరు మైమరచిపోవాలి, అందులో లీనమైపోవాలి. మీరెన్నో చదువులు చదువుతున్నారు. ఎన్నో దేశాలకు ప్రయాణం చేస్తున్నారు. కాని, ప్రేమ విలువను కించిత్తైనా మీరు గుర్తించడానికి ప్రయత్నం చేయడం లేదు. ప్రేమను రుచి చూసినప్పుడు మీకు జగత్తంతా ఒకే కుటుంబంగా కనిపిస్తుంది. ప్రేమనుండియే సత్యధర్మములు ఆవిర్భవిస్తాయి. "సత్యం వద, ధర్మం చర." దీనికి ప్రేమయే ఆధారం. కనుక, మీరు ప్రేమప్రవాహంలో మునిగి తన్మయులు కండి. ప్రేమకంటె మించిన చదువు

sri sathyasai vachanamrutam

మరొకటి లేదు. మీరు ఎన్నో గ్రంథాలు చదువుతున్నారు. కాని, వాటినుండి వచ్చిన ఫలిత మేమిటి? పుస్తకమును చేతియందు పట్టుకుంటారు గాని, మస్తకము నిండా 'మట్టి' ఉంటున్నది. ఈ 'మట్టి'ని పెంచుకోవడంచేతనే మీరు మానవత్వాన్ని మరచి పిచ్చివారుగా తయారౌతున్నారు. మొట్టమొదట మీ మస్తకములో ప్రేమను నింపుకోవాలి. మీరు ప్రేమను భుజించి జీర్ణించుకోవాలి. అప్పుడే ప్రేమరసము మీ నరనరములలోను ప్రయాణం చేసి మీకు శక్తిని, జ్ఞానమును ప్రసాదిస్తుంది. అయితే, మీరందరూ ప్రేమస్వరూపులే! మీయందలి ప్రేమ మీకు కనిపించడం లేదేమోగాని, నాకు కనిపిస్తున్నది. ఆ ప్రేమతత్త్వాన్ని మీరు గుర్తించి వర్తించడం లేదు.

విద్యార్థులారా! చాలాసేపు మాట్లాడి మీకు ఇబ్బంది కలిగించానేమో! అయితే, ఇది మీకు ఇబ్బంది కానే కాదు. ఇంతకంటె మించిన ప్రేమతత్త్వము మీకు మరి యెక్కడా లభించదు. దినదినమునకూ మీకు ప్రేమను అధికంగా అందిస్తాను. నాకు అంతకంటె వేరే పని యేమీ లేదు. మీలో ప్రేమను నింపడమే నా పని.

**(తేదీ 17.10.2003, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam